www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 7 ఫిబ్రవరి 2023

5

అన్నమయ్య





ఆర్‌డి కార్యాలయం



కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

కదంతొక్కిన అంగన్వాడీలు

- ముఖ ఆధారిత హాజరుపై ఆగ్రహం
- కలెక్టరేట్ దిగ్బంధనం
- అడ్డుకున్న పోలీసులు
- వేలాదిగా హాజరైన కార్యకర్తలు, ఆయాలు
- తోపులాటలో స్పృహ తప్పిన ఇద్దరు అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటిలో అంగన్వాడీలు కదంతొక్కారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు పెద్దఎత్తున తరలివచ్చి కలెక్టరేట్ దాకా ర్యాలీగా వచ్చారు. అంగన్వాడీలు ముఖ ఆధారిత హాజరుపై ఆగ్రహించారు. డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. ఉదయం 10 గంటలకే అంగన్వాడీల ధర్నా ప్రారంభమైంది. మధ్యాహ్నం అవుతున్నా అధికారులు స్పందించక పోవడంతో ఆగ్రహించిన అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. రూరల్ సిఐ తన సిబ్బందితో ఆందోళనకారులతో చర్చించినా శాంతించలేదు. పోలీసులను నెట్టుకొని కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం పోలీసులు మూసివేశారు. గంట పాటు కలెక్టర్ కార్యాలయం దిగ్బంధనం చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లనీయకుండా అంగన్వాడీలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు, కార్యాకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై అంగన్వాడీలు భగ్గుమన్నారు. తోపులాటలో ఇద్దరు అంగన్వాడీలు స్పృహ తప్పి పడిపోయారు. అనంతరం కలెక్టర్ గిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి మాట్లాడుతూ కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, జిఒ-1ను తక్షణమే రద్దు చేయాలని, ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి, సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని, అదనంగా హెల్పర్‌ను నియమించాలని, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీలకు జాబ్ కేలండర్ నిర్ణయించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెంటర్లను బలోపేతం చెయ్యడానికి నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల పర్యవేక్షణ చేయాలని, ఫుడ్ కమిషనర్, ఎం.ఎస్.కె, తహశీల్దార్, ఎంపిడిపి, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజులు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, వాటిని పరిష్కరించాలని న్యాయబద్ధంగా అడిగితే అక్రమంగా అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. ఈ ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, కెవిపిఎస్ నాయకులు పెంచులయ్య, డిసి.వెంకటయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, నాగబసిరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బంగారమ్మ, ఖాజాబీ, ఓబులమ్మ, శిద్దమ్మ, మధురవాణి, గౌరి, శ్రీవాణి, కరుణశ్రీ, పద్మశ్రీ, భూకైలేశ్వరి, శ్రీరమాదేవి, విజయమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ను దిగ్బంధించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు

ఆర్‌డి ఆఫీస్ లీలలు!

- ఫేక్ ఉత్తర్వుల ముసుగులో సూపరింటెండెంట్ సస్పెన్షన్
- అవిధేయత, పనితీరు సరిగాలేదనే పేరుతో కలరింగ్
- కోర్టుకెళ్లే యోచనలో బాధిత పర్యవేక్షణాధికారి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆర్‌డి కార్యాలయ పోస్టుల భర్తీ వ్యవహారం లీలలను తలపిస్తోంది. ఈ ఏడాది జనవరి మాసంలో కడప జోన్ పరిధిలో 291 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ దగ్గర నుంచి ఆర్‌డి, సూపరింటెండెంట్స్ మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. ఆర్‌డి చెప్పినట్లువినని అధికారులను విస్మరించి డిప్యూటేషన్‌పై అనుకూలురని నియమించుకుని డిడి సంతకాలు లేకుండా పోస్టింగుల వ్యవహారం నడుపుతున్న నేపత్యం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపత్యంలో ఆర్‌డి చెప్పినట్లు వినని అధికారులపై అవిదేయత, పనితీరు సక్రమంగా లేదనే పేరుతో సస్పెన్షన్స్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆర్‌డి కార్యాలయంలోని నలుగురు సూపరింటెండెంట్స్ నిర్లక్ష్యం చేసి జిజిహెచ్‌కు చెందిన నుంచి ఓ అధికారిని డిప్యూటేషన్‌పై వేయించుకుని స్టాఫ్‌నర్స్‌లు, ఎంఎల్‌హెచ్‌పి పోస్టులను భర్తీ వ్యవహారంలో భాగంగానే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం. సస్పెన్షన్ వ్యవహారం ముగియక ముందే సంబంధిత జిజిహెచ్‌కు చెందిన అధికారి రాజధాని కేంద్రమైన విజయవాడకు చేరుకుని సదరు సూపరింటెండెంట్ స్థానానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ మహిళా నిరుద్యోగి స్టాఫ్‌నర్స్ పోస్టు నిమిత్తం ఆర్‌డి, సూపరింటెండెంట్ ఫోర్జరీ సంతకాలతో కూడిన ఫేక్ ఉత్తర్వు సృష్టించి పులపుత్తూరు పిహెచ్‌సికి వెళ్లినట్లు సమాచారం. పులపుత్తూరులో స్టాఫ్‌నర్సులు ముగ్గురు ఉన్న నేపథ్యంలో మరొకరి వేయడంతో చోటుచేసుకున్న ఉదంతం ఆధారంగా సస్పెన్షన్ తతంగం నడిచినట్లు సమాచారం. దీనిపై పులపుత్తూరు పిహెచ్‌సి ఉన్నతాధికారి, చిత్తూరు డిఎంహెచ్‌ఒ ఫిర్యాదు ఆధారంగా పోలీస్ కేసు నమోదు చేసిన అనంతరం విచారణ చేపట్టాల్సి ఉన్నట్లు తెలిసింది. విచారణ చేపట్టకుండానే శుక్ర, శనివారాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు విధుల్లో ఉన్న సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీను తనకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడమేమిటని వాపోతుండడం గమనార్హం. శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు విధుల్లో ఉండి ఎఫ్‌ఆంఎస్ వేసి హృద్రోగ సంబంధిత సమస్యతో హాస్పిటల్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆగమేఘాల మీద సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై సదరు సూపరింటెండెంట్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి ఆర్‌డి కార్యాలయంలో చోటుచేసుకునే లీలలను తీసుకెళ్లిన అనంతరం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆర్‌డి ఉన్నతాధికారి కోటేశ్వరిని ఫోన్‌లో సంప్రదించగా అవిదేయత, పనితీరు సక్రమంగా లేదనే పేరుతో పలుమార్లు మెమోలు ఇచ్చామని, అయినప్పటికీ సూపరింటెండెంట్ పద్ధతి మార్చుకోకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొనడం గమనార్హం. ఫేక్ ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకోని నేపథ్యంలో కేసు ఎలా నమోదు చేశారని, ఫేక్ ఉత్తర్వులు, సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులకంటే ఎక్కువగా వేయడం, కోవిడ్‌లో పని చేసినందుకు సంబంధించి వెయిటేజీ మార్కులు ఎక్కువగా వేయడం, పనిచేయనప్పటికీ చేసినట్లు సర్టిఫికెట్లు తెచ్చుకోవడం, ఎంఎల్‌హెచ్‌పిగా విధులు నిర్వహిస్తున్న వారికి స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్‌లో వెయిటేజీ మార్కులను కలపడం వంటి ఆరోపణల ఆధారంగా లోతైన విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుత సస్పెన్షన్ ఉదంతంలో నలుగురు సూపరింటెండ్స్‌తోపాటు డిప్యూటేషన్ల వచ్చిన అధికారుల పాత్రపైనా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు లోకి వచ్చే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

విషజ్వరాల విజృంభణ

140 మంది విద్యార్థులకు జ్వరం - గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-నందలూరు



విద్యార్థులకు టెంపరేచర్ చూస్తున్న వైద్య సిబ్బంది

మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో విషజ్వరాలు విజృంభించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 700 మంది విద్యార్థుల్లో 140 మందికి పైగా విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాల వాతావరణం అపరి శుభ్రంగా మారడం తోపాటు వంట గది, తాగునీటి ట్యాంక్ అధ్వానంగా ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల ప్రభుత్వ వైద్యాధికారి సృజన, తన వైద్య బృందంతో కలిసి బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి హాసినికి తీవ్ర అస్వస్థతకు గురైంది. స్పృహ తప్పడంతో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బాలిక ఆరోగ్యం గురించి అడిగితే నిర్లక్ష్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమాధానం ఇచ్చారని బాలిక బంధువులు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రిన్సిపల్, నర్స్, కొంత మంది ఉపాధ్యాయుల బాధ్యత రాహిత్యం వల్లనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన చెందిన వారు, తమ పిల్లలను వారి వారి ఇళ్లకు తీసుకు వెళుతున్నారు. ఏది ఏమైనప్పటికీ పాఠశాలలోని అపరిశుభ్రతను తొలగించి విద్యార్థులకు అవసరమైన వైద్యంతో పాటు, సౌకర్యాలు మెరుగుపరచాలని స్థానికులు కోరుకుంటున్నారు.



కేంద్ర విద్యా శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలి

- కేంద్ర విద్యా శాఖ మంత్రికి ఎంపీ, ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోరారు. సోమవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్‌లోని మంత్రిని వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఉద్యోగులు నివాసాలు ఏర్పరచుకున్నారని తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థుల సౌకర్యం దృష్ట్యా కేంద్రీయ విద్యాలయం అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. స్థల సేకరణ కూడా పూర్తయిందని, ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోగా రాయచోటిలో కేంద్రీయ విద్యాలయం ప్రారభించాలని మంత్రిని కోరారు. మదనపల్లెలో కూడా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని, ఈ రెండింటినీ మంజూరు చేసి ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మీ చేతులమీదుగానే ప్రారంభించాలని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు.

'ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ ఆధారిత హాజరు నుంచి విఆర్‌ఎలను మినహాయించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ అన్నారు. సోమవారం విఆర్‌ఎలతో కలిసి సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఎలలో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేవని, వారిలో చాలా మంది నిరక్ష్యరాస్యులు కావడం చేత యాప్ వినియోగం తెలియదని పేర్కొన్నారు. కొందరు గ్రామీణ ప్రాంతాల వారికి నెట్ వర్క్ సమస్య కూడా ఉందని తెలిపారు. రాజంపేట డివిజన్‌లోని రాజంపేట, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబుళవారిపల్లె, వీరబల్లి, సుండుపల్లి మండలాలలోని విఆర్‌ఎలకు ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు సుధాకర్, వెంకటసుబ్బయ్య, కోటేశ్వరరావు, లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 56 ఫిర్యాదులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 56 ఫిర్యాదులు వచ్చాయని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో సత్వర న్యాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమస్యల నివేదికను ఎప్పటికప్పుడూ జిల్లా పోలీస్ కార్యాలయానికి అందించాలని అధికారులకు ఆదేశించారు.

బాలికల వసతి గృహాలను సందర్శించాలి : గిరీష

ప్రజాశక్తి -రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

జిల్లాలోని వివిధ శాఖల హెచ్‌ఒడిలు ప్రతినెలా రెండుసార్లు బాలికల వసతి గృహాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలపై దృష్టి సారించాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన హాల్లో వసతి గృహాల్లో చదివే బాలికల సంరక్షణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 53 ప్రభుత్వ బాలికల వసతి గృహాలున్నాయన్నారు. వివిధ శాఖల హెచ్‌ఒడిలు నెలకు రెండు సార్లు వసతి గృహాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలు గుర్తించాలన్నారు. దీన్ని ప్రతి అధికారి విధిగా భావించి సందర్శించాలన్నారు. 10 నుంచి 15 ఏళ్లలోపు వసతి గృహాలలోని విద్యార్థినులు తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతుంటారన్నారు. అందువల్ల వారి సమస్యలు పరిష్కరించేందుకు హెచ్‌ఒడిలు వసతి గృహాలను సందర్శించే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. అధికారులు వసతి గృహాలను సందర్శించినప్పుడు అక్కడ ఉన్న టీచర్లను బయటకు పంపి విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఒకవేళ విద్యార్థినిలు తమ సమస్యలు చెప్పడానికి భయపడితే 'మీ సమస్యలు టీచర్లకు చెప్పమని' వారికి తెలియజేయాలన్నారు. విద్యార్థినిలు నేరుగా తమ సమస్యలు చెప్పలేకపోతే వైట్ పేపర్ మీద రాయించుకుని అవి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థినులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛగా బాగా చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలోనూ తప్పక ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలని చెప్పారు. బాక్స్‌లలో విద్యార్థినులు తమ సమస్యలు రాసి అందులో వేసేటట్లు ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఇకనుంచి వసతి గృహాలలో చదివే విద్యార్థినుల సంరక్షణ మనందరి బాధ్యతగా భావించాలన్నారు. వారికి ఎటువంటి సమస్యలు తలెత్తిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్, సచివాలయ పోలీసులు వసతి గృహాలను సందర్శించే సమయంలో విద్యార్థినులకు లైంగిక విద్య, అనీమియా నివారణ, బాలికల ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు అధికారులు ఉక్కు పాదం మోపాలన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు ఏమీ తెలియదని అలాంటి వారికి బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం : ఆర్‌ఆర్



వార్డులో పర్యటించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో వైసిపి పాలన అస్తవ్యస్తంగా తయారైందని, జగన్‌మోహన్‌రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు ప్రజలు తమకు 'ఇదేమి ఖర్మ' అని అనుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలో 14వ వార్డులో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పట్టణంలోని వీధులలో తిరుగుతూ వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారన్నారు. మూడున్నర ఏళ్లుగా ఏం ఘనకార్యం చేశారని గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల ముందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. గడప గడపకూ కార్యక్రమంలో నాయకులను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. తాము ప్రజల కష్టాలు తెలుసు కునేందుకు వెళుతుంటే 2019 ఎన్నికల్లో తెలియక జగన్ పార్టీకి ఓట్లు వేశామని ఇప్పుడు ఇదేం కర్మ అని బాధపడు తున్నామని ప్రజలు అంటున్నారని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రానికి ఒక్క పరిశ్రమను తీసుకురాక పోగా టిడిపిలో తీసుకొచ్చిన పరిశ్రమలను తుగ్లక్ నిర్ణయాలతో వెళ్ళగొడుతున్నారని ఆరోపించారు. 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష, పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, టిడిపి నాయకులు, మన్సూర్, సోనిరాజ్ కలిమ్, పట్టణ ఉపాధ్యక్షులు రెహ్మాన్, మహబూబ్ అలీఖాన్, అత్తర్ జావిద్, శ్రీనివాసులు, శేషిజాబీర్, సయ్యద్, మాజీ కౌన్సలర్ మహబూబ్‌బాష, రాజంపేట సెల్ అధ్యక్షులు అమావాస్య రెడ్డయ్య, బసయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగులు భూములు పంపిణీ చేయాలని ధర్నా



ధర్నాలో నినాదాలు చేస్తున్న వ్య.కా.స, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మిగులు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు ఈసందర్భంగా సంఘం జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగులు భూములను ఆరులైన పేదలకు పంచాలని, వారి అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్న వాటిని తొలగించాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని వారు కోరారు. కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓ.పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి పేదవారికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుపురు రామచంద్ర, ఉపాధ్యక్షులు నాగసిరెడ్డి, మండల కార్యదర్శి కె.వి రమణ, అంజి, సురేంద్ర, చెన్నూరు హరికృష్ణ ఆది శివ, వెంకటేశు, కె.నాగేష్, రైతు నాయకులు జంగయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

రాయచోటి: స్పందన ద్వారా స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌ఒ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, డ్వామా పీడీ మద్దిలేటి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందనపై ప్రత్యేక శ్రద్ధ చూపి బాధితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా నలుమూల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారని తెలిపారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యేలా పరిష్కార నివేదిక పంపాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు.


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి- కలకడ

హైరిస్క్ గర్భవతులను గుర్తించాలని ఎర్రకోటపల్లి వైద్యాధికారి యంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని దేవులపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలందరికీ రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత లేకుండా చూడాలని అన్నారు. కష్టతరమైన గర్భిణులను ఉన్నతస్థాయి ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలని సూంచించారు. 60 సంవత్సరముల పైబడిన వారందరికీ షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కుష్టువ్యాధి, స్పర్శ కార్యక్రమంలో దేవలపల్లి ఉపాధ్యాయులు రమాదేవి వెంకటరమణలచే మానవహారం నిర్వహించారు. స్పర్శ లేని, పొడల వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపి హెచ్ఇఒ జయరారామయ్య, సూపర్వైజర్ రెడ్డెమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రాజ సులోచన, ఎఎన్ఎంలు వరలక్ష్మి, రమణమ్మ,104 సిబ్బంది శివకుమార్, రోజా, పైలెట్ రమేష్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమీక్ష

ప్రజాశక్తి-కలకడ

సామాజిక తనిఖీపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపిడిఒ సిహెచ్.నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2021-22 సంవత్సరంలో జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో జరిగిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ సభ్యులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. మంగళవారం నుంచి 14వ తేదీ వరకు కమిటీ సభ్యులు గ్రామాలలో పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, ఉపాధి హామీ సిబ్బంది, పిఆర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

మండల పరిధిలోని బాటవారిపల్లి జడ్పి హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పరిశీలించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న రెండు అదనపుగలను పరిశీలించి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ మునేంద్రనాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఇరగన్న, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఇందు

మండలంలోని గోపిదిన్నె ఉన్నత పాఠశాలలోని ఎనిమిదవ తరగతి చదువుతున్న వి.పల్లవి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చంద్రశేఖర్, పీడీ మంజుల తెలిపారు. కార్వేటి నగరంలో శనివారం అండర్-14 బాలికల విభాగంలో వాలీబాల్ ఆటల పోటీలు జరిగాయి. జిల్లా స్థాయి పోటీలలో పల్లవి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యింది. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో పల్లవిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రామసముద్రం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న కార్వేటి నగరంలో జరిగిన అండర్-14 జిల్లా స్థాయి బాలికల వాలీబాల్ పోటీల విభాగంలో రామసముద్రం మండలం అరికెల జడ్పి హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.ఇందు అద్వితీయమైన ప్రతిభ చాటి జిల్లా స్థాయి జట్టులో చోటు సంపాదించినట్లు ప్రధానో పాధ్యాయులు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 14 నుండి 16 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరపున ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.


ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రతిపక్షాలు ప్రభుత్వం చేసే అసత్య ఆరోపణలను తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే నవాజ్‌బాష వైసిపి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం స్థానిక సింగల్ విండో కార్యాలయంలో గృహ సారథులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఏ విధంగా పాటు పడుతుందో ప్రతి ఇంటింటికి వెళ్లి వివరించడమే గృహసారథుల పని అని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ బాధ్యత వాలంటీర్లు నిర్వహిస్తారని, పార్టీ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లెందుకే గృహ సారథుల నియామకం జరిగిం దన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పి వైసిపికి 151 ఎమ్మెల్యే సీట్లు అప్పగించారన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి నెల రెండు సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాలలోకి నేరుగా నగదు సాయం చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఈనెల 11న నుంచి గృహ సారథుల గడపగడపకు వైసిపి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జ్ రమణారెడ్డి, ఐప్యాక్ ఇన్‌ఛార్జ్ సత్యపాల్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రైతులకు భూ రీసర్వే పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-గుర్రంకొండ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భూముల రీ సర్వే పాస్ పుస్తకాలను సోమవారం మండలంలోని అమ్మిలేపల్లి, మర్రి మాకులపల్లి గ్రామాల రైతులకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పరిపాలన అనంతరం వంద సంవత్సరాల తర్వాత ఏ ప్రభుత్వం చేపట్టని భూముల రీసర్వేను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని భూములను రీసర్వే చేయించి రైతులకు తమ భూముల పాస్ బుక్కులను అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర, జడ్పిటిసి ముక్తియర్ సమ్రీన్, మండల ఆర్‌బికె చైర్మన్ జయచంద్రారెడ్డి, సర్పంచ్ మస్తాన్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్‌వి.రమణ, మాజీ సర్పంచ్‌లు జమీర్ అలీ ఖాన్, తాహశీల్దార్ ఖాజాబీ, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అభివృద్ధిని సాధించటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే నవాజ్ భాష అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నరసింహులు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజా ప్రతినిధుల ద్వారా గ్రామాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖల అధికారుల నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రధానంగా సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. మండల అధికారులు వారి శాఖల పరంగా మరింత అభివృద్ధిని సాధించటానికి కృషి చేయాలని అన్నారు. సొంత స్థలంలో కట్టుకున్న జగనన్న పక్కా గృహానికి అవసరమైన నూతన విద్యుత్ సదుపాయాన్ని ఉచితంగానే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, సంబంధించిన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎఇ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జ్ ఆర్ఐ.రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, ఎంపిడిఒ లీలామాధవి, ఎస్ఐ ఫాతిమా, ఎంపిటిసి, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరకు సాగు.. ఆదాయం బాగు


చెముళ్లపల్లె పొలాల్లో సాగులో ఉన్న చెరకు పంట

ప్రజాశక్తి - ఖాజీపేట

చెరు సాగు మంచి ఆదాయాన్నిస్తోందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని చెముళ్లపల్లె గ్రామ రైతులు ప్రతి ఏడాది చెరుకు పంటను సాగుచేస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు. ఎకరా పంటను సాగు చేస్తే లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరా చెరుకు సాగునకు రూ.40వేలు పెట్టబడి అవసరమని తెలిపారు. వేసవికాలం కావడంతో స్థానిక చెరుకు రసం వ్యాపారులు పొలాల వద్దకే వెళ్లి చెరుకును కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఏటా 150 ఎకరాలకు పైబడి చెరుకును సాగు చేస్తుంటామని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే మరింత మంది చెరుకు సాగుకు రైతులు ముందుకు వస్తారని పలువురు పేర్కొంటున్నారు. స్థానిక చెరుకు రసం వ్యాపారంపై ఆధారపడడం కంటే చక్కెర కర్మాగారం ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఎకరాకు 30 టన్నులు చెరుకు దిగుబడి వస్తుందని తెలిపారు. గతంలో ఖాజీపేట మండలంలో చెరుకు సాగు అధికంగా ఉండేది. అప్పట్లో రైతులు పొలంలోనే బెల్లం తయారు చేసి విక్రయించేవారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీకి చెరుకులను రైతులు తరలించేవారు. ఆ ఫ్యాక్టరీ మూత పడడంతో ఈ ప్రాంతంలో చెరుకు సాగు ఘననీయంగా తగ్గిపోయింది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి మూత పడిన చెక్కర ఫ్యాక్టరీని తెరిపిస్తే చెరుకు రైతులకు ఊరటగా ఉంటుంది. సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలి

ప్రజాశక్తి - వేంపల్లె


ప్రతిభ చూపిన విద్యార్థులతో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర

చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభ చూపాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆట స్థలంలో సోమవారం నిర్వహించిన షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికను నాగేంద్ర ప్రారభించారు. జిల్లా స్థాయిలో జరిగిన షూటింగ్ బాల్ క్రీడాల్లో ఆయా పాఠశాలల బాలుర, బాలికలు పాల్గొన్నారు. క్రీడలతో మంచి గుర్తింపు వస్తుందని సూచించారు. జిల్లా జట్టులో ఎంపికైన విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి మాదినేని నిత్యపూజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


ఈద్గా శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, 14 ఏళ్ల టిడిపి పాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ వైయస్సార్ పాలనలో కొంత అభివృద్ధి జరిగిన మాట వాస్తవమని, వైసిపి ప్రభుత్వం వచ్చినతర్వాత రూ.700 కోట్లతో పనులను వేగవంతం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈద్గాలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు ఇర్ఫాన్‌బాషా, కమల్‌బాషా, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్ట బాలాజీ, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో అగ్రస్థానం

సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం 200వ రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.. ప్రకాష్‌నగర్‌లో సోమవారం కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఎమ్మెల్యే రాచమల్లు వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో అప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మాజీ ఉప మండల అధ్యక్షుడు రాజారాంరెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పూసల సంఘం డైరెక్టర్ వెంకటరమణ, ఎంపిటిసి బాలాజీనివాస్, వార్డు మెంబర్లు లక్ష్మీనారాయణరెడ్డి, తాటి లక్ష్మీదేవి, తిరుపాల్‌రెడ్డి, ప్రకాష్‌నగర్ కన్వీనర్ కంభం వెంకటేశ్వర్లు, పుల్లయ్య, మాజీ ఎంపిటిసి సత్యం, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈనెల 21, 22 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరలో విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక దృష్టి పెట్టి భక్తులకు విద్యుత్ సౌకర్యం అందిస్తామని విద్యుత్ శాఖ డిఇఇ రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గంగమ్మ జాతర ప్రాంగణంలో విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఇ మాట్లాడుతూ జాతరలో విద్యుత్తు అంతరాయం కలగకుండా విద్యుత్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. విద్యుత్తు అలంకరణలో చాందిని బండ్లు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ హరినాథ, మానవత సభ్యులు శివయ్య, అర్చకులు రెడ్డి శేఖర్‌లు పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో కొత్త భవనాలు

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రమైన లింగాలలో రూ.40 కోట్లతో కొత్త కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల నిర్మాణానికి పాడా నిధుల రూ.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం సొసైటీ బ్యాంకు వద్ద 50 సెంట్లు స్థలం ఖాళీ ఉందని, అందులో ఆ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఉన్న సొసైటీ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ భవనం వద్దకు మార్చేందుకు అధికారులు ఆలోచిస్తున్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు ఇరుకుగా ఉండడంతో కొత్తవి నిర్మిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుందాం

ప్రజాశక్తి-పీలేరు

ఆదాని మోసాలను నిరసిద్దాం, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకుందా మని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఎస్‌బిఐ, ఎల్ఐసి కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సంపత్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు హేమంత్, ఉపాధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపిపి టి. లక్షుమయ్య సూచిం చారు. స్థానిక పిహెచ్‌సిలో సోమ వారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని వైద్యాధికారి రాజేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన అన్ని రకాల వసతులను కల్పించాలన్నారు. గర్భిణులకు మందులు సిఫిలిస్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. రిజిస్టర్ నిర్వహణ కచ్చితంగా ఉండాలన్నారు. ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమిటీ ఆధ్వర్యంలో నిధుల వినియోగంపై చర్చించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఎంపిటిసి సల్మా, సూపర్‌వైజర్ సరస్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దివాలా తీసే స్థితిలో రాష్ట్రం : 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి పాలనతో రాష్ట్రం దివాలా తీసే పరిస్థితికి చేరుకుందని మైదుకూరు టిడిని ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మండలంలోని బద్రిపల్లె గ్రామంలో సోమవారం ఆయన రాష్ట్రానికి ఇదేం ఖర్మ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడనున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి గెలిపించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలు వైసిపి పాలనలో విసిగి పోయారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, మాజీ మండల శాఖ అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు, సర్పంచు గుత్తి మల్లేశ్వరి, నారాయణ, టిడిపి నాయకులు మిల్లు శీను, సుదర్శన్, నారపరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ తోట్టి అబ్దుల్ కరీం, లక్ష్మీ నారాయణరెడ్డి, వెంకట రమణారెడ్డి, హరి కిరణ్ పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంలో మోడీ వైఖరి శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలను తడుముకొన్నట్లుంది అదానీ వ్యవహారంలో ప్రధాని మోడీ ప్రభుత్వ వైఖరి అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోడీకి, హోంశాఖ మంత్రి అమిత్‌షాకు మిత్రుడైన గౌతం అదానీ కంపెనీల అవకతవకలపై జెపిసితో గాని సుప్రీంకోర్టు పర్యవేక్షణతోగాని విచారణ జరిపించాలని పార్లమెంటులో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండగా, మోడీ ప్రభుత్వం విచారణకు ఆదేశించకుండా పారి పోవడం శోచనీయమన్నారు. మారిషన్, బహుమాన్, వర్జిన్ ఐలాండ్ ట్యాక్స్ హెవెన్ దేశాల్లో అదానీ సోదరులు బోగస్ సెల్ కంపెనీలు పెట్టారని ఆరోపిం చారు. నల్ల డబ్బులను వాటిలో పెట్టి అక్కడి నుండి స్టాక్ మార్కెట్లో పెట్టి అదానీ కంపెనీల షేర్ల విలువ అనూహ్యంగా పెంచారని తెలిపారు. ఆలస్యం చేయ కుండా విచారణకు ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం సాలాబాదు గ్రామానికి చెందిన వల్లూరు పుల్లయ్య గారి కుమారుడనైన వల్లూరు సిద్దయ్య అను నాకు చెందిన ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్. G9943196 పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు సమాచారం ఇవ్వగలరు సెల్ 99859 11602.

పేరు మార్పు

అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రామసముద్రం మజరా కొట్టాలపల్లి గ్రామం డోర్ నెంబర్ 6-128 కాపురాస్తులైన లింగుట్ల గిరి ప్రసాద్ అను నేను నా మైనర్ కుమార్తె లింగుట్ల హస్మిత చౌదరి అను పేరును ఈ దినం నుండి లింగుట్ల హంసిని చౌదరిగా మార్చుకొన్నాము.


పెరటి తోటను పరిశీలిస్తున్న చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

వార్డెన్‌ను అభినందించిన ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్‌సి హాస్టల్లో సోమవారం రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాపరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో సేంద్రియ ఎరువులతో పండిస్తున్న పచ్చిమిరప, టమోటా, గోంగూర తదితర కాయకూరలను పెరటి కూరగాయల తోటలను ఆయన పరిశీలించారు. హాస్టల్ ఆవరణంలో విద్యార్థులు చదువుకోడానికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించిన వార్డెన్ తిరుపతి రెడ్డిని ఆయన అభినందించారు. హస్టల్లో ప్రహరీ గోడ నిర్మించుకోవాలని దానికి తగిన నిధులు సమకూర్చడంలో సహకారం అందిస్తానని తెలిపారు. మధ్యాహ్న భోజనం హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలను పాటించి భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రంగనాథయ్య, వంటశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యా సామగ్రి అందుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు నందలూరుకు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ మాజీ అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీనివాసరావు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వివి.శివరాం ప్రసాద్, ఉపాధ్యాయులు కృష్ణ కిషోర్, కాకి సుబ్రమణ్యం, రవి శంకర్ రెడ్డిలు మాట్లాడుతూ శ్రీనివాసరావు ఉన్నత విద్యను అభ్యసించి గొప్ప సంస్థలో ఉద్యోగాన్ని సంపాదించి, నందలూరు వాసులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. తన దాతృత్వంతో విద్యార్థులలో ప్రేరణ నింపారని అభినందించారు. పదవ తరగతి విద్యార్థులు నిబద్ధతతో చదివి రాబోయే, పరీక్షలలో ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణత సాధించి పాఠశాల కీర్తిని వ్యాపింప చేయాలని కోరారు.

క్రైం కార్నర్

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని కనకంటివారిపల్లి సమీపంలో చింతచెట్టు కింద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. సోమవారం పేకాట శిబిరాలపై దాడులు చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.2,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో ఎం.రమణ, మోపిరెడ్డి, ఎం.కృష్ణప్ప, బి.నాగోజీ నాయక్, ఎస్.రాము నిందితులు వున్నారని ఎస్ఐ తెలిపారు.


పట్టుబడిన వాహనం, ఎర్రచందనం దుంగలతో పీలేరు రేంజ్ అధికారులు

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

అక్రమంగా ఎర్రచందనాన్ని తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు రేంజి అటవీశాఖ అధికారి బి.రామ్లా నాయక్ తెలిపారు. జిల్లా అధికారులకు అందిన సమాచారం మేరకు మండలంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలో కాపుకాశామన్నారు. సోమవారం ఉదయం మారెళ్ళ వైపు నుంచి వచ్చిన ఇన్నోవా కారును ఆపడానికి ప్రయత్నించగా డ్రైవర్ తమను గుర్తించి కారు ఆపకుండా ముందుకు దూసుకువెళ్లి కొంత దూరంలో కారు ఆపి చీకట్లో పరారయ్యాడని చెప్పారు. వాహనం తనిఖీ చేయగా అందులో 174 కేజీల బరువుగల 8ఎర్రచందనం దుంగలు గుర్తించామన్నారు. వాహనంతో సహా వీటి విలువ రూ.8లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. దాడుల్లో ఎఫ్ఎస్ ఎస్.వేణు, బీటు అధికారులు వెంకటేశ్వర్లు, బి.మునిస్వామి, డి.చంద్రకళ, ఎస్.రెడ్డి ఆసియ, డ్రైవర్, హరిబాబు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

బోయినపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

లారీ, బైక్ ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


బాబా ఫక్రుద్దీన్ (ఫైల్ ఫోటో)

ఒక్కగానొక్క కుమారుడు. తండ్రి చిన్నతనంలోనే మృతి చెందాడు. ఉన్నత విద్యను అభ్యసించి కన్నతల్లిని కంటికి రెప్పలా చూసుకోవాలని కోటి ఆశలతో ఇంజనీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థి కలను లారీ రూపంలో మృత్యువు కబళించింది. కన్నతల్లికి కడుపు కోత మిగిల్చింది. సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ బోయినపల్లి లోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం బోయనపల్లె లోని తన గది నుండి ఎపి21సిఎఫ్ నంబరు గల యమహా బైక్ పై రాజంపేటకు వస్తుండగా కడప నుండి తిరుపతికి వెళుతున్న కెఎ51 ఎహెచ్ 6300 అనే నంబరు గల లారీ ఢీకొని బోయినపల్లె వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంతో పాటు లారీ కింద పడిపోవడంతో తల మొండెం నుంచి వేరై మొండెంతో పాటు ద్విచక్ర వాహనాన్ని లారీ కొంత దూరంపాటు ఈడ్చుకెళ్లిన ఒళ్ళుగగుర్పొడిచే సన్నివేశాన్ని చూసిన స్థానికులు భయ భ్రాంతులకు గురయ్యారు. విద్యార్థి తండ్రి చిన్న తనంలోనే మరణించడంతో తల్లి ఇమాంబీ కష్టనష్టాలకొర్చి కుమారున్ని ఇంజినీరింగ్ చదివి స్తోంది. ప్రమాదానికి కారణమైన లారీ ముందు భాగాన కర్ణాటక రాష్ట్రం రిజిస్ట్రేషన్, వెనుక భాగాన హర్యానా రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు దర్శన మిస్తున్నాయి. జరిగిన ప్రమాదం పై రూరల్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.